క్లుప్తంగా

ప్రతిభ చూపిన విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు



ప్రశంస పత్రాలను అందజేస్తున్న దృశ్యం

కౌతాళం: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ ఏడాది పదో తరగతి పరీక్షల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బయోస్టాడ్ ఇండియా లిమిటెడ్ కంపెనీ వారు హెచ్ఎం ఇమ్మామను యేల్‌త్ కలిసి బుధవారం స్కాలర్‌షిప్‌లు పంపిణీ చేశారు. కంపెనీ సీనియర్ ఏరియా సెల్స్ మేనేజర్ వేణుగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ తమ కంపెనీలో వచ్చిన లాభల్లో కొంత భాగాన్ని తమ రైతు కుటుంబాల అభివృద్ధికి వినియోగించాలని నిర్ణయించామని ఇందులో భాగంగా పది మంది విద్యార్థులకు ఎంపిక చేసి ఒక్కొక్కరి రూ. 2,500 ప్రకారం అందజేసినట్లు చెప్పారు. డీలర్ దినేష్‌రెడ్డి, రఘు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ



స్టడీ మెటీరియల్‌తో విద్యార్థులు

మంత్రాలయం : మాధవరం ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న 40 మంది విద్యార్థులకు రూ.50 వేల విలువజేసే స్టడీ మెటీరియల్(గైడ్స్) మాచాని సోమప్ప మెమోరియల్ ట్రస్టు వారు ఉచితంగా అందజేశారని పాఠశాల పీడీ రాజశేఖర్ బుధవారం తెలిపారు. విద్యార్థులు ఉత్తీర్ణత సాధించేందుకు అవసరమైన మెటీరియల్ అందజేసేందుకు కృషిచేసిన ఉపాధ్యాయుడు నీలకంఠను సహచర ఉపాధ్యాయులు, విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు. హెచ్ఎం ఎస్.బోజరాజు, షఫీ పాల్గొన్నారు.

కొత్త పింఛన్లు మంజూరు

ఆదోని టౌన్: పట్టణానికి కొత్తగా 453 పింఛన్లు మంజూరయ్యాయని మున్సిపల్ కమిషనర్ రఘునాథ్‌రెడ్డి బుధవారం తెలిపారు. సెప్టెంబర్ 1వ తేదీ నుంచి నూతన లబ్ధిదారులకు నగదు పంపిణీ చేస్తామని చెప్పారు. మంజూరైన పింఛన్ల లబ్ధిదారుల పరిశీలన జరుగుతోందని, అర్హులందరికీ పింఛన్లు అందేలా చేస్తామని తెలిపారు.


డిగ్రీ కళాశాలలో చేరడానికి మరో అవకాశం

ఆదోని సెంట్రల్: డిగ్రీ కళాశాలలో ప్రవేశం పొందడానికి ప్రభుత్వం మరో దఫా అవకాశం కల్పించిందని ప్రిన్సిపాల్ శివారెడ్డి తెలిపారు. బుధవారం ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఆయన మాట్లాడుతూ కళాశాలలో ప్రవేశాలకు మొదటి విడత పూర్తి అయ్యిందని, మిగిలిన సీట్లకుగాను రెండవ విడత అవకాశం కల్పించిందన్నారు. ఈ నెల 28 నుంచి సెప్టంబర్ 1వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో రిజిస్టర్ చేసుకోవాలన్నారు. సెప్టంబర్ 4 నుంచి 9వ తేదీ వరకు వెబ్ ఆప్షన్ ఇచ్చుకోవాలని తెలిపారు. స్థానిక డిగ్రీ కళాశాలలో బీఏ, బీకాం బీజెడ్‌సీ కోర్సులు ఉన్నాయని చెప్పారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కంటి అద్దాల పంపిణీ

కౌతాళం:మండలంలోని కుంబళనూరు గ్రామానికి చెందిన 46 మంది కంటి ఆపరేషన్ చేయించుకున్న వారికి ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి సొంత ఖర్చుతో కళ్ల అద్దాలను అందజేసినట్లు సర్పంచ్ వీరేష్, డాక్టర్ ఈరన్న తెలిపారు. బుధవారం వారు మాట్లాడుతూ ఇటీవల గ్రామానికి చెందిన 46 మంది కర్నూల్‌లోని అమీలియా ఆసుపత్రిలో ఉచితంగా కంటి పరీక్షలు చేయించుకోగా కొందరికి కంటి ఆపరేషన్లు చేయించారు. అందులో 46 మందికి అద్దాల అవసరం కాగా వాటిని ఎమ్మెల్యే అందజేశారని చెప్పారు.

విగ్రహ ఏర్పాటుకు విరాళం



విరాళం అందజేస్తున్న దృశ్యం

మంత్రాలయం : కౌతాళం మండలం హాల్వి గ్రామంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటుకు రూ.45వేలను వైఎస్సార్‌సీపీ నాయకులు ఎస్.రాఘవేంద్రరెడ్డి, ఎస్.రామకృష్ణారెడ్డి గ్రామస్తులకు బుధవారం విరాళంగా అందజేశారు. వారు మాట్లాడుతూ విగ్రహం ఏర్పాటుకు అన్ని విధాలుగా అండగా ఉంటామని చెప్పారు. హుసేనప్ప, దేవపుత్ర, వెంకప్ప, ఆనందు, లూతర్, సురేష్ పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

కోసిగి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ ఈరన్న అధ్యక్షతన గురువారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రాజేంద్ర ప్రసాద్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ మండలంలో జరిగిన అభివృద్ధి, పథకాల పనితీరును శాఖల వారీగా చర్చించనున్నట్లు చెప్పారు. మండలంలోని అన్ని శాఖల అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు,జెడ్పీటీసీలు కావాలని కోరారు.







రణమండల ఆంజనేయస్వామికి ప్రదక్షిణ చేస్తున్న దృశ్యం, విక్రమ్ రోవర్ చంద్రయాన్‌పై ల్యాండ్ అవుతున్న దృశ్యాలను తిలకిస్తున్న ఉపాధ్యాయులు విద్యార్థులు, సంతోషం వ్యక్తం చేస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

చంద్రయాన్-3 విజయోత్సవ సంబరాలు

కౌతాళం: చంద్రుడి దక్షిణ ధ్రువంపై చంద్రయాన్-3 బుధవారం విజయవంతంగా కాలుమోపడంపై మండల కేంద్రంలో ప్రజలు, విద్యార్థులు జాతీయ జండాలతో విజయోత్సవ ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా వారు ఇస్రో శాస్త్రవేత్తలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. సాయంత్రం చంద్రయాన్-3 విజయంతో యువకులు జయహో భారత్ అంటూ స్వీట్లు పంచుకుని సంబరాలు జరుపుకున్నారు. ర్యాలీలో మంజునాథ, సోమిరెడ్డి, ఆచారి, యువకులు నరసప్ప, వీరభద్ర, శంబు, విద్యార్థులు పాల్గొన్నారు. నదిచాగి గ్రామంలో 50 అడుగుల జాతీయ జెండాతో యువకులు, గ్రామస్తులు విజయోత్సవ ర్యాలీ నిర్వహించి స్వీట్లు పంచుకున్నారు.

ఆదోనిఅర్బన్ : చంద్ర మండలం దక్షిణ ధ్రువంపై చంద్రయాన్-3 విజయవంతంగా ల్యాండ్ కావడంపై బీజేపీ నాయకులు విజయోత్సవ సంబరాలు చేపట్టారు. బుధవారం సాయంత్రం భీమాస్ సర్కిల్‌లో మిఠాయిలు పంచి బాణసంచా కాల్చారు. ఈ కార్యక్రమంలోబీజేపీ రాష్ట్ర కారయవర్గ సభ్యులు విట్టా రమేష్, జిల్లా కార్యదర్శి నాగరాజుగౌడ్, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షులు మలేకర్ శ్రీనివాసులు, బీజేవెం రాష్ట్ర కార్యదర్శి ఆచారి, పట్టణ ప్రధాన కార్యదర్శి ఉరుకుందగౌడ్, ఉపాధ్యక్షులు దేవేంద్ర, ఎస్సీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి నాగార్జున, వెంకటేష్, బాలాజీ తదితర నాయకులు పాల్గొన్నారు. అంతకుముందు రణమండల కొండలో వెలి సిన ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు చేశారు.

ఆదోని సెంట్రల్: చంద్రయాన్-3 చంద్రునిపై విజయవంతంగా ల్యాండ్ అవడం పట్ల మానవాళికి ఎన్నో ఉపయోగాలు ఉన్నాయని నెహ్రూ మెమోరియల్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అలీం సిద్దిఖీ తెలిపారు. బుధవారం ల్యాండింగ్‌పై లైవ్‌ను విద్యార్థులు, ఉపాధ్యాయులు తిలకించారు. ఈ సందర్భంగా వారు ఇస్రో శాస్త్ర వేత్తలకు అభినందనలు తెలిపారు. ఉపాధ్యాయులు అనిల్‌కుమార్, రామయ్య, ప్రహ్లాద్, కల్యాణ్‌రామ్, వరప్రసాద్ పాల్గొన్నారు.





కౌతాళంలో ర్యాలీలో పాల్గొన్న గ్రామ ప్రజలు, విద్యార్థులు, నదిచాగిలో 50అడుగుల జాతీయ జెండాతో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

బీఎల్‌ఓ సస్పెన్షన్

ఆదోనిరూరల్ : పట్టణంలోని పోలింగ్ సెంటర్ నంబర్ 124లో బూత్ లెవెల్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న తుకారాంను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సృజన సస్పెండ్ చేసినట్లు తహసీల్దార్ వెంకటలక్ష్మి బుధవారం రాత్రి తెలిపారు. తుకారాం సచివాలయం సంఖ్య- 21015007లో వార్డు ప్లానింగ్ అండ్ రెగ్యులేషన్ సెక్రటరీగా విధులు నిర్వర్తించేవాడని, ఈయనకు పోలింగ్ సెంటర్ నంబర్ 124 బీఎల్‌వోగా విధులు కేటాయించగా రాజకీయ పార్టీ ప్రతినిధులు, ఓటర్, ప్రజలతో ఎన్నికలకు సంబంధించిన సమాచారం అడిగినప్పుడు అమర్యాదగా నిర్లక్ష్య ధోరణితో వ్యవహరించాడని ఈనెల 22న సబ్ కలెక్టర్‌కు ఫిర్యాదు అందడంతో సస్పెండ్ చేసినట్లు చెప్పారు. బీఎల్‌ఓలు, బీఎల్‌ఏలు రాజకీయ నాయకులు, ఓటర్లు, ప్రజలతో మర్యాద పూర్వక ప్రవర్తనతో మెలుగుతూ జవాబుదారీ తనంతో వ్యవహరించాలని సూచించారు.

ఐటీఐలో అడ్మిషన్లు

ఆలూరు రూరల్: ఆలూరు ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో మూడవ విడత దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సూరప్ప బుధవారం ప్రకటనలో వెల్లడించారు. 2023-24 సంవత్సరంలో ఐటీఐ కోర్సుల్లో చేరాలనుకునే విద్యార్థులు ఈ నెల 27వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు స్థానిక ఐటీఐ కళాశాలలో సర్టిఫికెట్లు వెరిఫికేషన్ చేయించుకోవాలన్నారు. ఈ నెల 30వ తేదీన ఉదయం 9 గంటల నుంచి కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని సూచించారు.

పౌష్టికాహారం అందజేత

ఆదోనిఅర్బన్ : ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ), లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రధానమంత్రి టీబీ ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా మందులు తీసుకుంటున్న టీబీ రోగులకు పౌష్టికాహారం అందజేశారు. స్థానిక శ్రీనివాస కల్యాణమండపంలో బుధవారం దాదాపు రూ.లక్ష విలువైన పౌష్టికాహారం ప్యాకెట్లను 33 మంది టీబీ రోగులకు పంపిణీ చేశారు. ఇలా ప్రతి రోగికి ఆరు నెలల పాటు ఇచ్చేందుకు వారు అంగీకరించారు. ఐఎంఏ అధ్యక్షురాలు డాక్టర్ ఉషారావు, సెంట్రల్ వర్కింగ్ కమిటీ మెంబర్ డాక్టర్ గోపీనాథ్, స్టేట్ వర్కింగ్ కమిటీ మెంబర్లు డాక్టర్ కృష్ణమూర్తి, హరీష్, ఆదోని టీబీ ఆఫీసర్ డాక్టర్ శేఖన్‌భాను, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ రఘురామిరెడ్డి, లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ ధర్మారెడ్డి, రీజియన్ చైర్మన్ ప్రసాదరావు, కోశాధికారి శంకరమ్మ, ఈసీ మెంబర్లు పాల్గొన్నారు.



టీబీ రోగులకు పౌష్టికాహారాన్ని అందజేస్తున్న దృశ్యం

కుట్ర రాజకీయాలు టీడీపీకే చెల్లు

పత్తికొండటౌన్: కుట్ర రాజకీయాలు చేయడం టీడీపీ నాయకులకే చెల్లు అని, నిరంతరం ప్రజల్లో ఉంటూ అభివృద్ధికి పాటుపడుతున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవిపై అనుచిత ఆరోపణలు చేస్తే సహించేది లేదని ఎంపీపీ ఎం.నారాయణదాసు, వైఎస్సార్‌సీపీ నాయకుడు అటికెలగుండు బాబురెడ్డి స్పష్టం చేశారు. బుధవారం పత్తికొండ వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడుతూ.. ఎమ్మెల్యేపై టీడీపీ నాయకులు చేసిన ఆరోపణలను ఖండించారు. ఈనెల 10న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి పుచ్చకాయలమాడలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం చేపడితే ప్రజలందరూ స్వాగతించారన్నారు. అయితే టీడీపీ నాయకులు వారి అనుచరులతో రాళ్లు వేయించి, గొడవలు సృష్టించేందుకు కుట్రలు చేశారని, ఎమ్మెల్యే సంయమనం పాటించి వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు నచ్చజెప్పి గొడవలు జరగకుండా చూశారని చెప్పారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగేలా వ్యవహరించిన వారిపై సీసీ ఫుటేజీల ఆధారంగా పోలీసులు కేసులు నమోదు చేశారన్నారు. ప్రజల్లో ఆదరణ కోల్పోయిన టీడీపీ నాయకులు అమాయకులను రెచ్చగొడుతూ, కుట్రలకు పాల్పడుతూ నీచరాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు.. పుచ్చకాయలమాడ అల్లర్ల కేసులో నిందితులను పోలీస్‌స్టేషనుకు పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చి పంపితే టీడీపీ నాయకులు బాణాసంచా కాల్చి సంబరాలు చేసుకోవడం, రెచ్చగొట్టే ప్రసంగాలు చేయడం చూస్తే వారికి ప్రజాస్వామ్యంపై ఎంత విశ్వాసం ఉందో అర్థం అవుతుందన్నారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారని తగిన బుద్ధి చెబుతారన్నారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి శ్రీరంగడు, జిల్లా ప్రధాన కార్యదర్శి రామచంద్ర, మండల కన్వీనర్ కారం నాగరాజు, నాయకులు సోమశేఖర్, భాస్కర్‌నాయక్, అంజినయ్య, గాంధీరెడ్డి, కృష్ణ, శ్రీను, నాగరాజు, మోహన్, రవిరెడ్డి, రవికుమార్, రంగానాయక్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీపీ నారాయణదాసు, వైఎస్సార్‌సీపీ నాయకులు

బాల్య వివాహాలతో భవిష్యత్ నాశనం

తుగ్గలి: బాల్య వివాహాలతో భవిష్యత్ నాశనమవుతుందని కర్నూలు డీఎల్‌డీఓ, గ్రామ వార్డు సచివాలయాల ఇన్‌చార్జ్ అధికారి బాలకృష్ణారెడ్డి అన్నారు. బాల్య వివాహాల నిషేధంపై స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. చిన్న వయసులో వివాహం చేయడం వల్ల పుట్టే పిల్లల్లో మానసిక రుగ్మతలు, రక్తహీనతతో పాటు ఎన్నో అనర్థాలు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. చట్టరీత్యా స్త్రీలకు 18, పురుషులకు 21 సంవత్సరాలు నిండితేనే వివాహాలకు అర్హులన్నారు. బాల్య వివాహాల నిర్మూలనకు పిల్లలను కచ్చితంగా చదివించాలన్నారు. ప్రభుత్వం కూడా కళ్యాణమస్తు, షాదీతోఫా ద్వారా ఎస్సీ, ఎస్టీలకు రూ.1.20 లక్షలు, బీసీలకు రూ.75 వేలు, ముస్లింలకు రూ.లక్ష, భవన నిర్మాణ కార్మికులకు రూ.40 వేలు అందజేస్తుందన్నారు. ఎక్కడైనా బాల్య వివాహాలు చేస్తున్నట్లయితే చైల్డ్‌లైన్ టోల్‌ఫ్రీ నంబర్ 1098కు సమచారం అందించాలన్నారు. తహసీల్దార్ రవి, ఎంపీడీఓ సావిత్రి, ఎంఈఓ మాలతి, ఎస్ఐ మల్లికార్జున, ఐసీడీఎస్ సిబ్బంది, వీఆర్వోలు, మహిళా పోలీసులు పాల్గొన్నారు.



తుగ్గలిలో మాట్లాడుతున్న డీఎల్‌డీఓ బాలకృష్ణారెడ్డి

పోలీసు లాంఛనాలతో అంత్యక్రియలు



కురవ రాఘవేంద్ర (ఫైల్)

నందవరం: మంత్రాలయం సమీపంలోని గోశాల వద్ద మంగళవారం జరిగిన బైక్ ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు మృతి చెందిన విషయం విదితమే. అందులో మాధవరం గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ బోయ గోవిందు (25), మరో వ్యక్తి నందవరం మండలం ఇబ్రహీంపురం గ్రామానికి చెందిన కానిస్టేబుల్ కురవ రాఘవేంద్ర (35) దుర్మరణం చెందారు. ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రిలో మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించారు. బుధవారం కానిస్టేబుల్ మృతదేహాన్ని ఇబ్రహీంపురం గ్రామానికి తీసుకువచ్చారు. డీఎస్పీ సీతారామాంజనేయులు, సీఐలు మోహన్‌రెడ్డి, శ్రీనివాసులు, ఎరిషావలి, ఎస్ఐలు తిమ్మయ్య, ఎస్ఐ సతీష్ ఆధ్వర్యంలో పోలీసు లాంఛనాలలో భాగంగా గాలిలో తుపాకులు పేల్చి గౌరవ వందనం సమర్పించారు. రోడ్డు ప్రమాదం రూపంలో రాఘవేంద్ర మృత్యువాత పడడంతో కుటుంబ సభ్యులు, భార్య పిల్లల రోధనలు మిన్నంటాయి. ఈ సంఘటనతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. మృతుడికి భార్య శివమ్మతో పాటు ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు.



గౌరవ వందనం సమర్పిస్తున్న పోలీస్ అధికారులు

ఓటరు సర్వే 92 శాతం పూర్తి

ఆలూరు రూరల్: రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు చేపట్టిన ఓటరు సవరణ సర్వే ఈ నెల 18వ తేదీ నాటికి 92 శాతం పూర్తయినట్లు హాలహర్వి మండల తహసీల్దార్ మల్లికార్జున అన్నారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ సమావేశ భవనంలో నియోజకవర్గంలోని అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు, బీఎల్‌ఓ సూపర్వైజర్లతో సమావేశం నిర్వహించారు. గత నెల 21వ తేది నుంచి చేపట్టిన ఓటరు జాబితా సవరణలో భాగంగా బీఎల్‌ఓలు ఇంటింటికీ వెళ్లి కొత్త ఓటర్ల నమోదు, మార్పులు,చేర్పులుకు సంబంధించిన ఫారాలను స్వీకరించారన్నారు. మరణించిన వారి ఓట్లు, గ్రామం విడిచి ఇతర ప్రాంతాలకు శాశ్వతంగా వెళ్లిన ఓటర్లను తొలగించారన్నారు. ఇప్పటివరకు నియోజకవర్గంలో 2,634 కొత్త ఓటరు ఫారాలు స్వీకరించి, 1,047 మంది మరణించిన వారు, ఇతర ప్రాంతాలకు వెళ్లిన వారి ఓట్లు గుర్తించామన్నారు. 3,453 మంది ఓటర్లు అడ్రస్ మార్పులు, పేర్లు మార్పులు చేశామన్నారు. ఈ నెల చివరిలోగా సర్వే పూర్తి చేస్తామని చెప్పారు. తహసీల్దార్లు హుసేన్ సాహెబ్, లక్ష్మినారాయణ ఎన్నికల డీటీ గుండాల్‌నాయక్ ఉన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

ఆదోనిటౌన్ : మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలన్నదే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మున్సిపల్ కమిషనర్ రఘునాథ్‌రెడ్డి, మెప్మా ప్రాజెక్టు అధికారిణి సనాబాను ఆధ్వర్యంలో నిర్మల్ టాకీస్ సర్కిల్‌లో ఏర్పాటు చేసిన తినుబండారాలు, కుట్టు వస్త్రాల మెప్మా స్టాల్, ఆహా క్యాంటీన్‌ను ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పొదుపు సంఘాల ద్వారా బ్యాంకు లింకేజీతో తీసుకున్న రుణాలతో చేతివృత్తుల ద్వారా తయారుచేసిన చీరలు, ఎంబ్రాయిడింగ్, ఫినాయిల్ తయారీ, ఊదిబత్తీలు, తినుబండారాలు తదితర వస్తువులను తయారీ చేసి విక్రయిస్తూ ఆర్థికంగా నిలదొక్కుకోవడం అభినందనీయమన్నారు. అనంతరం ఎగ్జిబిషన్‌లో ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను పరిశీలించారు. కౌన్సిలర్‌లు రాజేశ్వర్‌రెడ్డి, బాలాజీయాదవ్, ఫయాజ్‌అహ్మద్, ఆర్‌పీలు, పొదుపు సంఘాల మహిళలు, పట్టణ గౌరవాధ్యక్షులు చంద్రకాంత్‌రెడ్డి, పట్టణాధ్యక్షుడు దేవా, మార్కెట్‌యార్డు వైస్ చైర్మన్ తిమ్మప్ప పాల్గొన్నారు.



ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి, చైర్‌పర్సన్ బోయ శాంత

అభివృద్ధి, సంక్షేమం జగనన్నకు రెండు కళ్లు

ఆదోనిరూరల్ : అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లలా భావించి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండలంలోని నాగలాపురం గ్రామంలో.. ఎమ్మిగనూరు -నాగలాపురం రోడ్డు నిర్మాణ పనులకు సర్పంచ్ కోట పరమేష్, మాజీ సర్పంచ్ కోటా వీరారెడ్డితో కలిసి భూమిపూజ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ జగనన్న నాలుగేళ్ల పాలనలో ఇచ్చిన మాట తప్పకుండా సంక్షేమ పథకాలను అమలు చేస్తూ అభివృద్ధి పనులు చేపడుతున్నారన్నారు. ఎమ్మిగనూరు రోడ్డు నుంచి నాగలాపురం రోడ్డుకు రూ.56 లక్షలు మంజూరయ్యాయని చెప్పారు. అంతేగాకుండా త్వరలో ఎమ్మిగనూరు రోడ్డు, కపటి, పెద్దపెండేకల్-చిన్నపెండేకల్, సిరుగుప్ప-ఇంగళదహాల్ తదితర రోడ్ల పనులు కూడా చేపడతామని చెప్పారు. గతంలో బీటీ రోడ్డుకు ఒక ఇంచు ఎత్తులో వేసేవారని, ఇప్పుడు మూడు ఇంచులు బెడ్డు, బీటీ, తారు, కంకరతో 9 ఇంచుల ఎత్తులో రోడ్డు వేస్తున్నట్లు వివరించారు. పంచాయతీరాజ్ డీఈ ఖాదర్‌బాషా, ఏఈ మాలిక్‌బాషా, మార్కెట్‌యార్డు వైస్ చైర్మన్ కామాక్షి తిమ్మప్ప, నాయకులు నరసింహమూర్తి, భీమన్న, రామాంజనేయులు పాల్గొన్నారు.



రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ఆదోనిఅర్బన్ : దేవనకొండ మండలం చెల్లిచెలిమల గ్రామానికి చెందిన హుసన్నగౌడ్, లక్ష్మి బైకుపై బుధవారం సాయంత్రం వెళ్తుండగా గణేకల్ సమీపంలో కారు ఢీకొనడంతో గాయపడ్డారు. వెంటనే స్థానికులు 108 వాహనంలో ఆదోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఉరుకుంద ఈరన్నస్వామిని దర్శించుకునేందుకు బైకుపై వెళ్తుండగా కారు ఢీకొట్టిందని తెలిపారు. వారిని మెరుగైన చికిత్సల కోసం కర్నూలుకు రెఫర్ చేసినట్లు వైద్యసిబ్బంది చెప్పారు.

సేంద్రియ ఎరువులను వాడాలి

గోనెగండ్ల: రైతులు సాగు చేసిన పంటలకు సేంద్రియ ఎరువుల వాడకంపై దృష్టి పెట్టాలని జిల్లా వనరుల కేంద్రం ఏడీ మాధురి, హేమలత, స్వప్న అన్నారు. బుధవారం హెచ్. కైరవాడి గ్రామంలో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పంటలు సాగుచేస్తే భూసారం పెంచే వానపాములు తయారవుతాయన్నారు. భూసారం పెరగడంతో పంట దిగుబడి ఎక్కువగా వస్తుందన్నారు. మంచి దిగుబడులు పొందేందుకు వ్యవసాయ అధికారుల సలహాలు సూచనలు పాటించాలని సూచించారు.

రైతు ఆత్మహత్యపై విచారణ

నందవరం: గురజాల గ్రామానికి చెందిన కౌలు రైతు కురవ భీరప్ప ఈ నెల 19న పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్న విషయం విదితమే. బుధవారం ఆర్ఐ జెర్మియా, ఏఈఓ సురేంద్రగౌడ్ రైతు ఆత్మహత్యకు గల కారణాలపై విచారణ చేపట్టారు. ఆయన కౌలుకు తీసుకున్న పొలం, సాగు చేసిన పంటలు, ప్రైవేటు అప్పులు, బ్యాంకు అప్పులపై విచారించారు. తుది నివేదికను ఉన్నాతాధికారులకు పంపుతామని అధికారులకు తెలిపారు.

యువకుడి ఆత్మహత్య

హొళగుంద: మండల పరిధిలోని కొత్తపేట గ్రామానికి చెందిన శేఖన్న (22) మంగళవారం రాత్రి అనారోగ్యంతో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. సదరు యువకుడు 12 ఏళ్ల వయసులో పోలియో బారిన పడ్డాడు. అప్పటి నుంచి తరచూ నరాలు బిగుసుకుపోవడం, ఇతర అనారోగ్య సమస్యలు తలెత్తుతుండేవి. ఈ క్రమంలో నెలన్నర క్రితం కర్ణాటక రాష్ట్రం చానాళ్‌కు చెందిన లక్ష్మితో వివాహం జరిగింది. అనారోగ్య సమస్యలతో మానసిక వేదనకు గురై ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్ఐ తెలిపారు. భార్య లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

నీటి విడుదలపై హర్షం

చిప్పగిరి: హంద్రీ-నీవా కాలువకు ప్రభుత్వం నీటిని విడుదల చేయడంపై ఎంపీపీ జూటూరు హేమలత హర్షం వ్యక్తం చేశారు. స్థానిక ఎంపీపీ కార్యాలయంలో వారు మాట్లాడుతూ.. వరుణ దేవుడు ముఖం చాటేయడంతో సాగు చేసిన పంటలు ఎండిపోయే పరిస్థితికి చేరుకున్నాయన్నారు. మండలంలోని వివిధ గ్రామాల రైతులకు మేలు కలుగుతుందన్నారు.

గ్రామ స్థాయిలో సచివాలయ కన్వీనర్లే కీలకం





సమావేశంలో మాట్లాడుతున్న మురళీమోహన్ రెడ్డి హాజరైన సచివాలయ కన్వీనర్లు

కోసిగి: 2024 సార్వత్రిక ఎన్నికల్లో జగనన్న గెలుపుకు రథసారథులుగా గ్రామ స్థాయిలో సచివాలయ కన్వీనర్లే కీలకమని మండల జేసీఎస్ కన్వీనర్ మురళీ మోహన్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మా నమ్మకం నువ్వే జగన్ నినాదంతో జేసీఎస్ నమోదు శిబిరం కార్యక్రమంలో భాగంగా మండలంలోని వివిధ గ్రామాల సచివాలయ కన్వీనర్లతో సమావేశం నిర్వహించారు.ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పరిపాలనలో మండల ఇన్‌చార్జ్‌లు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులను దృష్టిలో ఉంచుకుని ఉచిత బీమా సౌకర్యం కల్పించడం సంతోషించదగ్గ విషయమన్నారు. రాబోవు రోజుల్లో కార్యకర్తలు, పార్టీ కోసం శ్రమించే ప్రతి ఒక్కరికీ అండగా నిలుస్తారన్నారు. కలిసి కట్టుగా సార్వత్రిక ఎన్నికల్లో పనిచేసి సీఎం జగనన్నకు కానుకగా ఇద్దామన్నారు. ఎంపీపీ ఈరన్న, మండల నాయకులు నాడుగేని నాగరాజు, బసిరెడ్డి, బుళ్లి నరసింహులు, చింతలయ్య. వెంకటేష్, రమేష్, సచివాలయ కన్వీనర్లు పాల్గొన్నారు.

ఘనంగా ఆంధ్రకేసరి జయంతి

కౌతాళం: ఆంధ్రకేసరి టంగుటూరు ప్రకాశం పంతులు జయంతిని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రిన్సిపాల్ సంతోష్‌కుమార్ మాట్లాడుతూ దేశం కోసం పోరాడిన ప్రకాశం పంతుల చరిత్రను విద్యార్థులు తెలుసుకోవాలన్నారు. అధ్యాపకులు రవికుమార్, శ్రీనివాసరెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.



ప్రకాశం పంతులు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

వైఎస్సార్‌సీపీతో నిరంతర సంక్షేమం



మాట్లాడుతున్న తెర్నెకల్ సురేందర్ రెడ్డి

దేవనకొండ: కరోనా విపత్కర పరిస్థితుల్లోనూ సంక్షేమ పథకాలు అందించిన ఘనత సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికే దక్కిందని శ్రీశైలం నియోజకవర్గ అబ్జర్వర్ తెర్నెకల్ సురేందర్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం తెర్నెకల్‌లో ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు. మాజీ సీఎం చంద్రబాబునాయుడు అధికారం నుంచి దిగిపోయే నాటికి రాష్ట్రం అప్పుల ఊబిలో కూరుకుపోయిందని, ఆ అప్పులను తగ్గించేందుకు సీఎం జగనన్న శాయశక్తులా కృషి చేశారన్నారు. యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు పరిశ్రమల స్థాపన, సాఫ్ట్‌వేర్ హబ్‌లను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకున్నారని వివరించారు. అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి సంక్షేమ పథకాలు అందించిన ఘనత జగనన్నకే దక్కిందన్నారు. సంక్షేమ సారథి వైఎస్ జగనన్నను రానున్న ఎన్నికల్లో మరోసారి సీఎంగా గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. మంత్రి గుమ్మనూరు జయరాం, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా ఉరుసు

గోనెగండ్ల: మండల పరిధిలోని గంజిహళ్లి గ్రామంలో వెలసిన మహాత్మ గంజిహళ్లి బడేసాహెబ్ స్వామి వారి పెద్ద ఉరుసు బుధవారం భక్తులు ఘనంగా నిర్వహించారు. ప్రతి ఏడాది శ్రావణ మాసంలో ఈ ఉరుసును భక్తులు ఘనంగా నిర్వహిస్తారు. ఈ మాసంలోనే స్వామివారు జీవసమాధి అయ్యారని పీఠాధిపతి చిన్న ముద్గోల్ స్వామి తెలిపారు. ఉరుసు సందర్భంగా జీవసమాధిని పూలతో అలంకరించి ప్రార్థనలు చేశారు. పార్లపల్లి గ్రామానికి చెందిన త్రివిక్రం రెడ్డి, ప్రతాపరెడ్డి, అరంజ్యోతిలు మొక్కుబడిలో భాగంగా రూ.70 వేలు విలువ చేసే వెండి పాదుకలను పీఠాధిపతి సయ్యద్ చిన్న ముద్గోల్, ధర్మకర్త కుబేరరెడ్డి సమక్షంలో స్వామి జీవసమాధికి అమర్చారు.

రేపు వాహనాల వేలం

ఆలూరు రూరల్: ఆలూరు పోలీసు సర్కిల్ పరిధిలోని ఆలూరు, హొళగుంద, హాలహర్వి, ఆస్పరి పోలీసు స్టేషన్‌లో పరిధిలో అక్రమ మద్యం తరలిస్తూ పట్టుబడిన వాహనాలను శుక్రవారం ఆలూరు పోలీసు స్టేషన్ ఆవరణంలో పత్తికొండ డీఎస్పీ శ్రీనివాస రెడ్డి సమక్షంలో వేలం వేయనున్నట్లు సీఐ వెంకటేశ్వర్లు బుధవారం వెల్లడించారు. నాలుగు స్టేషన్ల పరిధిలో 47 ద్విచక్రవాహనాలు, 5 కార్లు, 2 మినీ వెహికల్స్, ఒక ఆటోను వేలం వేస్తున్నట్లు చెప్పారు. ఆసక్తి కలిగిన వారు రూ.3 వేలు చెల్లించి వేలం పాటలో పాల్గొనవచ్చన్నారు.